క్లుప్తంగా

కనకదుర్గమ్మకు విశేష పూజలు



పెందుర్తి: మండలంలోని ఎస్ఆర్ పురం కనకదుర్గమ్మ ఆలయంలో ఆశ్వయుజ అమావాస్య పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం నాణేల అలంకరణలో ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులు ప్రసాద వితరణ చేశారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్నకు అమావాస్య తిరువీధి



తిరువీధి ఉత్సవంలో ఉత్సవమూర్తులు

సింహాచలం: అమావాస్యని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తిరువీధిని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్టింపజేసి సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి జరిపారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సీసీ రోడ్డు, కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పెదముషిడివాడ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శుక్రవారం పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కొండవాలు నుంచి సబ్బవరం రహదారి వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు, కాలువలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను నాణ్యతగా, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, కూటమి నాయకులు బుగిడి రామగోవిందరావు, నగిరెడ్డి చిన్నారావు, ఎం.ఎస్.నాయుడు, దుళ్ల రామునాయుడు, స్థానిక నాయకులు ఉన్నారు.

లంకెలపాలెం-అసకపల్లి రోడ్డుకు శంకుస్థాపన నేడు



అభివృద్ధి చేయనున్న లంకెలపాలెం-అసకపల్లి రోడ్డు

పరవాడ: అధ్వానంగా మారిన లంకెలపాలెం-అసకపల్లి రోడ్డు నిర్మాణం కోసం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొల్లి రవీంద్ర శనివారం 10 గంటలకు శంకుస్థాపన చేస్తారని కూటమి పార్టీ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొంటారని పేర్కొన్నారు. సదరు కార్యక్రమానికి మండలంలో కూటమి నాయకులు హాజరై విజయవంతం చేయాలని కార్యాలయ సిబ్బంది కోరారు.

సరకుల వితరణ

సబ్బవరం: గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా ఇరువాడలోని కృపా సహకార కేంద్రంలో శుక్రవారం పేదలకు, వికలాంగులకు, వృద్ధులకు నిత్యావసర సరకులు అందించారు. రెవగంటి అరుణ్‌పాల్‌తో కలిసి ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయకుమార్ 30 మందికి సరకులను అందించారు. కార్యక్రమంలో బ్రదర్ అనిల్, బ్రదర్ ఇస్సాతో పాటు ట్రస్ట్ సభ్యులు మాధ్యూ, దివ్య, తేజ, రమ్య, స్మైలీ పాల్గొన్నారు.

సాగునీటి రంగానికి కీలకం సాగునీటి వినియోగదారుల సంఘాలు. ఆయకట్టుకు సాగునీరందించే చెరువులు, జలాశయాల అభివృద్ధిలో ఈ సంఘాలదే ప్రధానపాత్ర. అందుకే రాజకీయ పార్టీలు సైతం సాగునీటి సంఘాలపై పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. సబ్బవరం మండలంలోని 23 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటిని దక్కించుకునేందుకు కూటమి నేతలు ఇప్పటికే కుట్రలు, కుయుక్తులకు దారి తీస్తున్నారు.

ఆయకట్టుపై ఆధిపత్య పోరు



ఆదిరెడ్డిపాలెంలోని పోతురాజు చెరువు

- గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి
- ఎన్నికలకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల ఏర్పాట్లు
- చెరువుల అభివృద్ధిలో ఈ సంఘాలే కీలకం
- దక్కించుకునేందుకు 'పచ్చ'నేతల పావులు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. సాగునీటి చెరువుల అభివృద్ధి, నిర్వహణ, బలోపేతానికి ఈ ఎన్నికలు ఎంతో కీలకం. దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో సాగునీటి చెరువుల అభివృద్ధికి ఎంతో కృషి జరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సైతం రీ సర్వేలో భాగంగా పలు సాగునీటి చెరువులను సమగ్రంగా సర్వే చేసి, వాటి పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. ఈసారి సాగునీటి సంఘాల ఎన్నికల్ని కూటమి నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు జరగనున్న ఎన్నికల్లో అన్ని సంఘాలనూ తామే దక్కించుకోవాలనే ఉద్దేశంతో పావులు కదుపుతున్నారు.

24 చెరువులు.. 23 సంఘాలు

సబ్బవరం మండలంలో వంద ఏకరాల ఆయకట్టుకు పైబడి నీరందిస్తున్న సాగునీటి చెరువులు 24 ఉన్నాయి. ఇందులో అమృతపురంలోని హరప్ప చెరువు, శీలకట్టు చెరువు కలిపి ఒకే సాగునీటి సంఘం ఉంది. దీంతో మొత్తం 23 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏయే చెరువుల కింద ఎంత సాగు విస్తీర్ణం ఉంది? ఎంత మంది రైతులు ఓటర్లుగా ఉన్నారు అనే నివేదికలను ప్రధాన పార్టీల నేతలు సేకరించే పనిలో ఉన్నారు. ఓటు హక్కు లేని వారికి ఆ హక్కు కల్పించేలా రెవెన్యూ అధికారులను సంప్రదించే పనిలో ఎన్నికల బరిలో నిలిచే పలువురు రైతులు బిజీగా ఉన్నారు. ప్రస్తుతానికి కూటమి నేతల కనుసన్నల్లోనే ఈ వ్యవహారమంతా నడుస్తోంది.

ఎన్నికల నిర్వహణ ఇలా..

ఒక్కో చెరువు కింద ఉన్న ఆయకట్టును ఆరు ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజిస్తున్నారు. ఒక్కో దానికి ఒక డైరెక్టర్‌ను ఆ పరిధిలో ఉన్న ఓటర్లు(రైతులు) ఎన్నుకుంటారు. ఆరుగురు డైరెక్టర్లలో ఒకరిని ఆ సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా మిగిలిన ఐదుగురు డైరెక్టర్లు ఎన్నుకుంటారు. ఓటు వేసే రైతులకు తప్పనిసరిగా పట్టాదార్ పాస్‌బుక్ లేదా, రెవెన్యూ అధికారులిచ్చిన 1 బీ లేదా అడంగల్ ఉండాలి. అవి చూపకుంటే ఓటు వేసేందుకు అధికారులు అనుమతించరు.

పట్టు కోసం పోటీ

సాగునీటి చెరువుల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్, కాల్వల మరమ్మతులు, చేపల పెంపకం, చెరువు గట్లపై వేసే మొక్కల ఫలసాయం తదితర అన్ని అంశాల్లో సాగునీటి సంఘానికి కీలక పాత్ర. సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఆయకట్టు పరిధిలోని రైతుల్ని తమ పట్టులో ఉంచుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతల్లో పదవుల కోసం పోటీ నెలకొంది. ఏదో ఓ పదవి పేరిట అలాంటి వారి నోళ్లు మూయించేందుకు ఈ సాగునీటి సంఘాల అధ్యక్ష పదవుల్ని 'పచ్చ' పార్టీ అధిష్టానం ఓ ఆయుధంగా వాడుకుంటోంది.

గ్రామం	చెరువులు	ఆయకట్టు (ఎకరాల్లో)
అయ్యన్నపాలెం	1	222.21
బోదువలస	2	259.81
గుల్లేపల్లి	1	312.38
మొగలిపురం	3	459.55
గొటివాడ	1	271.52
అంతకాపల్లి	2	357.76
టెక్కలిపాలెం	1	119.34
నారపాడు	1	285.33
నల్లరేగులపాలెం	1	138.69
బాటజంగాలపాలెం	2	223.43
ఇరువాడ	1	122.10
పైడివాడ	1	132.92
గొల్లలపాలెం	2	401.63
అమృతపురం	4	602.59
సబ్బవరం	1	295.96

9 మందిని ఎన్నుకునేవాళ్లం



మా గ్రామంలో ఉన్న పోతురాజు చెరువు, రెడ్డి చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగేవి. ఒక్కో చెరువుకు ఒక అధ్యక్షుడితోపాటు, 9 మంది డైరెక్టర్లను ఎన్నుకునేవాళ్లం. పోతురాజు చెరువు కింద 250 మందికి పైగా రైతులు ఉంటారు. గతంలో రెడ్డి చెరువుకు కూడా సాగునీటి సంఘాలను ఎన్నుకునేవాళ్లు. ఆ చెరువుకు ఆయకట్టు రైతులు తక్కువగా ఉండటంతో ఎన్నికలను రద్దు చేశారు.

– గొంప దేముడు, ఆదిరెడ్డిపాలెం, సబ్బవరం

చెరువుల అభివృద్ధి మా చేతుల్లో..



సాగునీటి సంఘాలతో చెరువుల్ని అభివృద్ధి చేసుకోవచ్చు. బోనివాని చెరువు కింద సమారు 120 ఎకరాల ఆయకట్టు ఉంది. 150 మందికి పైగా రైతులున్నారు. ప్రతిసారీ ఈ చెరువుకు సాగు నీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయి. గ్రామంలో గైరమ్మ చెరువు, నూకాలమ్మ చెరువు, గొట్టిపాటి చెరువు వంటి చిన్న చెరువులున్నప్పటికీ వాటికి ఆయకట్టు తక్కువ కావడంతో ఎన్నికలు జరగవు.

–బలిరెడ్డి కనకరాజు, ఇరువాడ గ్రామం, సబ్బవరం మండలం


మూడు రోజులు ఎన్నికలు



సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి 10న సాగునీటి చెరువుల ఆయకట్టు వారీగా ఓటర్ల జాబితాలను విడుదల చేస్తాం. 19 వరకూ అభ్యంతరాలను స్వీకరించి, సవరణలను చేపట్టి అదే రోజు తుది జాబితా ప్రకటిస్తాం. 20న నోటిఫికేషన్, 21, 22, 23 తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తాం. ఓటు వేసే రైతులకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారు పాస్‌బుక్, 1 బీ, అడంగల్ ఏదో ఒకటి తప్పనిసరి.

– ఎస్.సాయికిరణ్, ఇరిగేషన్ ఏఈ, సబ్బవరం మండలం

ఘనంగా ఆకాశదీప మహోత్సవం



విజినిగిరిపాలెం ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం

సింహాచలం: కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పలు శివాలయాల్లో ఆకాశ దీప మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సింహగిరిపై త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, విజినిగిరిపాలెం ఉమాచంద్రమౌళీశ్వరస్వామి తదితర ఆలయాల్లోని ధ్వజస్తంభాల వద్ద ఆకాశదీపాల్ని వెలిగించారు. విశేష పూజలు జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం



శరవేగంగా సాగుతున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు

పరవాడ: మండల కేంద్రంపరవాడ సంతబయలు వద్ద దాతల సహకారంతో సుమారు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడి ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి, నూతన ఆలయ నిర్మాణానికి గ్రామ పెద్దలు ఇటీవల శ్రీకారం చుట్టారు. ఆలయాన్ని విశాలమైన స్థలంలో, మరింత సుందరంగా నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాల్సిందిగా సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు కోరారు.

జీడి తోటలకు స్వచ్ఛంద బీమా సౌకర్యం

- ఎకరానికి ప్రీమియం రూ.1,540
- పంట నష్టపోతే రూ.30,800 పరిహారం



ఎ.లావణ్య, ఉద్యానశాఖ అధికారి, పరవాడ

పరవాడ: మండలంలో రైతాంగం సాగు చేస్తున్న జీడి తోటలకు ప్రభుత్వం స్వచ్ఛంద బీమా పథకాన్ని అమలు చేయడానికి చర్యలు చేపట్టిందని పరవాడ ఉద్యానశాఖ అధికారి ఎ.లావణ్య తెలిపారు. ప్రభుత్వం 2024–25లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమయిందన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రబీ సీజన్‌లో అధిక వర్షాలు, అకాల వర్షాలు, అధిక తేమ, ఉష్ణోగ్రతల కారణంగా దెబ్బతిన్న తోటలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఎకరం విస్తీర్ణంలో దెబ్బతిన్న జీడి తోటలకు రూ.30,800 బీమా లభిస్తుందన్నారు. రైతు ఎకరానికి ప్రీమియం కింద రూ.1,540 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రీమియంను అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్(ఏఐసీ)కి ఈ నెల 15లోగా చెల్లించాలని పేర్కొన్నారు. జీడి పంటలపై బ్యాంకులో రుణం పొందిన రైతులు స్వచ్ఛంద డిక్లరేషన్ సమర్పిస్తే సరిపోతుందన్నారు. బ్యాంక్ రుణాలు పొందని రైతులు పీఏసీఎస్, బ్యాంకు అధికారులు, ఏఐసీ కంపెనీ ఇన్‌చార్జ్ వి.దుర్గామోహన్(8886929474), ఫీల్డ్ కోఆర్డినేటర్‌ను సంప్రదించవచ్చన్నారు. గ్రామ సచివాలయం, నేషనల్ కార్పొరేషన్ ఇన్సూరెన్స్ పోర్టల్(ఎన్‌సీఐపీ) ద్వారా కూడా రైతులు నేరుగా తమ ప్రీమియంను చెల్లించవచ్చని తెలిపారు. ఈ పథకాన్ని పొందేందుకు ఆధార్‌కార్డు, భూమి పత్రాలు, పంట సాగు ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్, ఫోన్ నంబర్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాలుష్య ప్రభావిత గ్రామాల్ని తరలించాలి

పరవాడ: ఫార్మాసిటీ, ఎన్టీపీసీ కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి, మూలస్వయంభూవరం, సోమినాయుడుపాలెం గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పరిశ్రమల కాలుష్యం కారణంగా క్యాన్సర్, కిడ్నీ, చర్మ, ఊపిరితిత్తుల, గుండె సంబంధిత వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆయా గ్రామాలను వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పీసీబీ అధికారులు ప్రభుత్వానికి నివేదించినా, చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు.

సింహగిరిపై ఘనంగా నరకాసుర వధ



నరకాసుర వధ ఘట్టాన్ని నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు



బాణాసంచా వెలిగించి దీపావళి పండగ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై గురువారం రాత్రి నరకాసుర వధ ఉత్సవం ఘనంగా జరిగింది. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఒక పల్లకీలో, నరకాసురుడి విగ్రహాన్ని మరో పల్లకీలో అధిష్టింపజేశారు. సింహగిరి మాడ వీధుల్లోకి తిరువీధిగా తీసుకొచ్చారు. నరకాసురుడిని, ఉత్సవ మూర్తుల పల్లకీలను ఎదురెదురుగా ఉంచి యుద్ధ సన్నివేశాలు నిర్వహించారు. నరకాసురుడిని వధించే ఘట్టం చేపట్టారు. తర్వాత బాణసంచా కాల్చా రు. అర్చకులు నరకాసురవధ ఘట్టాలను విన్నపం చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఉత్సవాన్ని చేపట్టారు.

రాళ్లు తేలి.. గోతులు పడి



రాళ్లు తేలిన వెంకటాపురం రహదారి



ఛిద్రమైన మెట్టపాలెం రోడ్డు

- అధ్వానంగా వెంకటాపురం, మెట్టపాలెం రోడ్లు
- మరమ్మతులు చేపట్టాలని స్థానికుల మొర

పరవాడ: రాళ్లు తేలిన రహదారులతో ప్రతినిత్యం నరకం చవిచూస్తున్నామని వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం, నాయుడుపాలెం శివారు మెట్టపాలెం గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా మారిన ఈ రెండు రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. వాడచీపురుపల్లి నుంచి వెంకటాపురం వరకు ఏర్పాటు చేసిన రెండు కిలోమీటర్ల బీటీ రహదారి దాదాపు దశాబ్ద కాలంగా మరమ్మతులకు నోచుకోలేదు. రహదారిలో అడుగుకో గుంత, రాళ్లు తేలిపోయి నడవడానికి కూడ వీల్లేని పరిస్థితి. రాళ్లు తేలిన రోడ్డుపై రాకపోకలు సాగించడం వలన వాహనాలకు పంక్చర్లు పడటంతోపాటు, తరచూ రిపేర్లకు గురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

మెట్టపాలెం నుంచి పాతరాజన్నపాలెం వరకు నిర్మించిన రహదారి కూడ అధ్వానంగా ఉంది. రహదారి మొత్తం ఛిద్రమైంది. మెట్టపాలెం పరిసర గ్రామాల్లో కాయగూరలు అధికంగా పండిస్తుంటారు. వాటిని మార్కెట్లకు తరలించడానికి రైతులకు ఈ రహదారే పెద్ద దిక్కు. రోడ్డంతా పాడైపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం వర్షం పడినా గోతుల్లో చేరిన వర్షపు నీటితో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రెండు రోడ్లను అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హరోంహరా.. కార్తీకం వచ్చెరా



నరవ: స్వయంభూ ఉమా నాగ లింగేశ్వర స్వామి



విద్యుత్ కాంతులతో రాంపురం శివాలయం



రంగులతో ముస్తాబైన సాధుమఠం రామలింగేశ్వరాలయం

*న కార్తీక సమో మాసో న కృతేన సమం యుగమ్
న వేదసదృశం శాస్త్రం న తీర్థం గంగయా సమమ్..*

కార్తీక మాసానికి సమానమైన మాసం, కృత యుగానికి సాటిరాగల యుగం, వేదాల కంటే గొప్పదైన శాస్త్రం, గంగానదికి మించిన నది లేదని స్కంద పురాణం చెప్తోంది. చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కలిసే పుణ్యకాలం కార్తీకం. కార్తీక మాసం సదాశివుడు, మహావిష్ణువు పూజలకు పరమం పవిత్రం. అందుకే ఊరూవాడా శివకేశవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. నెలంతా ఆధ్యాత్మిక శోభతో అలరారనున్నాయి.

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- సుందరంగా ముస్తాబైన శివ, కేశవ క్షేత్రాలు
- భక్తిశ్రద్ధలతో పూజలకు సిద్ధమైన ప్రజలు

పెందుర్తి: పవిత్ర కార్తీక మాసోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని శివాలయాలతోపాటు, వైష్ణవాలయాలు కూడా సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో మెరుస్తున్నాయి. తొలి వేకువ నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. ప్రజలు భక్తిశ్రద్ధలతో లింగాకారుడిని కొలువనున్నారు. అభిషేకాలు, అర్చనలతో పూజించనున్నారు.

ముస్తాబైన ఆలయాలు

శతాబ్దం క్రితం పెందుర్తి సాధుమఠం వద్ద రామలింగేశ్వర స్వామి కొలువుదీరాడు. స్వయంభూ లింగావతారంలో వెలసిన ఈ శివున్ని కొలిస్తే మంచి జరుగుతుందని ప్రజల నమ్మకం. దీంతో పెందుర్తి మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చి, కార్తీక మాసంలో ఇక్కడ పూజలు నిర్వహిస్తుంటారు. కార్తీక సోమవారం రోజుల్లో భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు.

- పినగాడిలోని గణేష్ పార్వతి సమేత చొడేశ్వర స్వామి ఆలయం చక్కటి పూల మొక్కలు, కోనేరు, చెట్లతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. ఈ నెల రోజులు ఇక్కడ విశేష పూజలు జరుగుతాయి.
- ప్రశాంతినగర్‌లోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి దేవాలయం, శ్రమశక్తినగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయం, సుజాతనగర్ హరిహర క్షేత్రం, చింతలగ్రహారంలోని శివాలయం పెందుర్తి ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాలు. ఈ నెలంతా భక్తుల రద్దీ దృష్ట్యా ఆయా దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- సబ్బవరం మండలంలోని దేవీపురం కార్తీక మాసోత్సవాలకు ముస్తాబైంది. జిల్లాలోనే ఈ ప్రాంతం వన సమారాధనలకు అత్యంత ప్రసిద్ధి.
- జీవీఎంసీ 88వ వార్డు నరవలోని స్వయంభూ ఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయం కార్తీక మాస పూజలకు ముస్తాబైంది. ఇక్కడ ఒకే పాదమట్టం మీద వెలసిన స్వామివారు, అమ్మవారి విగ్రహాలు 13వ శతాబ్దానికి చెందినవిగా ప్రతీతి. వందేళ్ల క్రితం ఓ రైతు ఇక్కడి పొలంలో దుక్కి చేస్తుండగా స్వామివారి విగ్రహం బయల్పడినట్లు స్థల పురాణం చెబుతుంది. ఏటా కార్తీక మాసంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్తీక వనసమారాధనలకు ఎంతో అనుకూలమైన ప్రాంతం.

సింహగిరిపై విశేషంగా నృసింహ హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరిపై నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని కొలువుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద కూర్చోబెట్టారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణను శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

రెవెన్యూ సదస్సులో ప్రతి అర్జీకి పరిష్కారం



అయ్యన్నపాలెం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీకి సకాలంలో పరిష్కారం చూపిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని అయ్యన్నపాలెంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి, భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వ, ప్రజల అవసరాలకు ప్రభుత్వ భూములు ఎంతో అవసరమని, అలాంటి భూముల ఆక్రమణలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ సభకు రైతుల నుంచి 141 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు. వాటన్నింటినీ వీలైనంత వేగంగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుదిరెడ్ల శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్, సర్వేయర్లు ఎల్.అప్పారావు, శ్యామ్, రాంబాబు, వీఆర్వో ఎం గోవిందరావు, గ్రామ పెద్దలు తుంపాల నానాజీ, బుదిరెడ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.